రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

టిప్పర్ ఢీకొని సర్పంచ్‌కు తీవ్ర గాయాలు

కొడంగల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

కొడంగల్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను చేపడుతున్న ఎస్‌వికె కంపెనీకి చెందిన టిప్పర్ ఢీకొని మండల పరిధిలోని అప్పాయిపల్లి సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి సర్పంచ్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

శనివారం కొడంగల్ నుండి అప్పాయిపల్లికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణంలో వెళ్తున్న సర్పంచ్ ద్విచక్ర వాహనాన్ని ఎస్‌వికె కంపెనీకి చెందిన టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో సర్పంచ్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఈ సంఘటనపై ఎస్‌వికె కంపెనీపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్‌చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

నందిగామ, ఆగస్టు 29, ప్రభాతవార్త:

నందిగామ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని ధన్సింగ్ తండా సమీపంలో 44వ బైపాస్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎం.అరుణబాయి (42) మృతిచెందినట్లు నందిగామ ఎస్ఐ దేవరాజ్ తెలిపారు.

రాఖీ పండుగ సందర్భంగా హైదరాబాదులోని కర్మన్‌ఘాట్‌లో ఉన్న తమ పెద్దకుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి తిమ్మాజీపేట వైపు ద్విచక్ర వాహనంపై అచ్చంపేట వైపు వస్తుండగా వెనకనుంచి వస్తున్న లారీ టైర్ పేలిపోయి లారీ అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణబాయి లారీ టైర్లకింద పడి అక్కడికక్కడే దుర్మరణం పాలయింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారైనట్లు ఎస్సై దేవరాజ్ పేర్కొన్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ప్రమాదం సంభవించిందని చెప్పారు. ఈ ఘటనపై మృతురాలిభర్త మల్లెకేడి మహేశ్వర్‌జీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దేవరాజ్ తెలిపారు.

ఎన్కెపల్లి సర్పంచ్ దయాకర్ సస్పెన్షన్

పూడూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:

వికారాబాద్‌జిల్లా పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ టి. దయాకర్ సస్పెండ్ అయ్యారు. ఓ భూవ్యవహారంలో స్థానిక సర్పంచ్‌పై కేసు నమోదు కావడంతో ఆయన రిమాండ్‌లో ఉండగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఓ జయసుధ ఆయనను సర్పంచ్ పదవినుండి తాత్కాలికంగా తప్పించారు. గ్రామ పరిపాలనా సౌలభ్యంకోసం ఉపసర్పంచ్ విజయ్ కుమార్‌కు ఇంచార్జి సర్పంచ్‌గా బాధ్యతలను, పంచాయతీ లావాదేవీలు, చెక్కుల నిర్వహణ కోసం ఎంపిఓ సుందర్‌కు తాత్కాలికంగా అధికారాన్ని అప్పగించారు.

ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఉద్యమం

-శంషాబాద్‌లో బిజెపి ఆధ్వర్యంలో నిరసనదీక్ష



శంషాబాద్‌లో నిర్వహించిన నిరసనదీక్షలో పాల్గొన్న బిజెపినేతలు

శంషాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

విద్యార్థుల జీవితాలతో రాష్ట్రప్రభుత్వం చెలగాటం ఆడొద్దని రాష్ట్రప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదలచేయాలని పలువురు బిజెపినేతలు డిమాండ్ చేశారు. శనివారం శంషాబాద్‌లో రంగారెడ్డిజిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిరసనదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నంతో పలువురు బిజెపి ముఖ్యనేతలు హాజరై మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.15 వేలకోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా 40లక్షల మంది విద్యార్థుల జీవితాలను ఆగంచేస్తుందని మండిపడ్డారు. సంవత్సరాల తరబడి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడితెస్తున్నాయని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. లేకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థిసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం బిజెపి పోరాటం చేస్తుంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తుందని ఎన్నికలసమయంలో విద్యార్థులసంక్షేమం, విద్యకు పెద్దపీటవేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు అదే విద్యార్థులను పట్టించుకోకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లా, రాజేంద్రనగర్ నియోజకవర్గ ముఖ్యనేతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ నడిపేవారు హెల్మెట్ ధరించాలి

-మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

హెల్మెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

మేడ్చల్ నియోజకవర్గం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్‌రోడ్‌లో సత్య హోటల్ దగ్గర తేజ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జరిగిన రోడ్‌సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కార్‌లో ప్రయాణం చేసేవారు తప్పకుండా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. తేజ హెల్పింగ్ హ్యాండ్స్ వారు ఇంతమంచి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, వారికి అన్నివిధాలా సహాయసహకారాలు అందిస్తానని తెలియజేసారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి యువత ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, దయానంద్‌యాదవ్, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

భూబాధితులకు నష్టపరిహారం చెల్లింపు

-మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

చెక్కులు అందజేసిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి దృశ్యం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, ప్రభాతవార్త:

సికింద్రాబాద్‌నుంచి శామీర్‌పేటవరకు ఎలివేటెడ్ కారిడార్ రోడ్డునిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోతున్న బాధితులు 63మందికి రూ.96.5కోట్ల చెక్కులను అందజేసినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బాధితులకు చెక్కులను కలెక్టర్ అందజేశారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని అల్వాల్ మండల భూయజమానులకు రెండవ విడతలో చెక్కులు అందజేసినట్లు తెలిపారు. రాజీవ్‌రహదారిన రోడ్డు వెడల్పులో భూములు, స్థలాలు కోల్పోతున్నవారికి 7,222చదరపుగజాల స్థలాన్ని ఇచ్చిన 63 మందికి పరిహారంగా చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ, జిల్లా భూసేకరణ అధికారిణి మాలతి, అధికారులు, బాధిత లబ్దిదారులు పాల్గొన్నారు.

మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

మేడ్చల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

మేడ్చల్ పట్టణంలో శనివారం మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని స్థానిక సమస్యలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించడంతో పాటు డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతనకమిటీ ఎన్నిక కోసం అశావాహుల పేర్లు సేకరించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే నిబద్ధత గల నాయకులకు, యువతకు ఈ కమిటీలో ప్రాధాన్యత కల్పించాలని.రాబోయే ఎన్నికలు, స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా ఈ నూతన కమిటీని ఎన్నుకోవడం కోసం పలువురు పేర్లు తీసుకోవడం జరిగిందని డివిజన్ అధ్యక్షుడు పేర్కొన్నాడు. కొత్తగా ఎన్నికయ్యే బాడీ సభ్యులు ప్రజా క్షేత్రంలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదదితరులు పాల్గొన్నారు.

పేదల పెళ్లిళ్లకు తులం బంగారం

-అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీచేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

త్వరలో పేదల బిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం అందజేస్తామని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం ధారూర్ మండలకేంద్రంలోని రైతు వేదికలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత పదిసంవత్సరాల నుంచి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదల కలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. మండల పరిధిలో మొత్తం 12,405 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయని వెల్లడించారు. అలాగే అనంతగిరిని త్వరలోనే ప్రముఖ టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసి, స్థానికయువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం నుంచి సబ్సిడీ కింద మంజూరైన విత్తనాలు, పెట్రోల్ పంపులను లబ్ధిదారులైన రైతులకు పంపిణీచేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి స్వర్ణలత, జిల్లా వ్యవసాయ అధికారిణి కవిత, డిఎస్పీ అంజయ్య, ఎంపిడిఓ నర్సింలు, డిసిసి ప్రధాన కార్యదర్శి బాబాఖాన్, ఎఎంసి చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మాజీ జడ్పిటిసి రాములన్న, సంతోష్, యూనుస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన.. పనితీరుపై డిప్యూటీ కలెక్టర్ ఆరా!

-పాఠశాల నుంచి ఆరోగ్యకేంద్రం వరకు విస్తృత తనిఖీలు

పాఠశాలలో తనిఖీలు చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

కొత్తూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:

కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో ప్రభుత్వ శాఖల పనితీరును డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గ్రామంలో పర్యటించిన ఆమె ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీకేంద్రం, ఆరోగ్యకేంద్రాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. అధికారులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? ప్రభుత్వపథకాల ప్రయోజనాలు అర్హులకు చేరుతున్నాయా? మౌలిక వసతుల పరిస్థితి ఎలా ఉంది? అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. ముందుగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ కలెక్టర్.. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మౌలిక వసతులు, క్రీడాప్రాంగణం, పల్లె ప్రకృతివనం తదితరఅంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన సేవలను ఎలాంటి జాప్యంలేకుండా అందించాలని, గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. అనంతరం పెంజర్ల ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన కిరణ్మయి.. తరగతి గదులు, విద్యార్థుల హాజరు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైనవిద్య అందించడంతో పాటు ప్రతివిద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు.

గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ కలెక్టర్.. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్య, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సక్రమంగా చేరేలా చూడాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని, కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. పెంజర్ల ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించిన ఆమె.. రోగులకు అందుతున్న వైద్యసేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను తనిఖీచేశారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైద్యసిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్యకేంద్రానికి వచ్చే ప్రతిరోగితో మర్యాదగా వ్యవహరిస్తూ, అవసరమైన మందులు, వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల పనితీరు ప్రజలకు అందుతున్న సేవల ఆధారంగానే అంచనా వేయబడుతుందని, అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చొరవచూపాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్, ఎంపీ అరుంధతి, మండల విద్యాధికారి వెంకట్రాంరెడ్డి, ఎంపిడిఓ స్వాతి, డిప్యూటీ సర్పంచ్ శాంతన్‌రెడ్డి, వార్డుసభ్యులు, గ్రామస్థులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ అధికారులు, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి

బిఎల్ఓలతో మాట్లాడుతున్న అదనపు ప్రధాన ఎన్నికల అధికారి

కొడంగల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో ఈఆర్ఓ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, ఎఈఆర్ఓలు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి ఓటర్లకు నోటీసులు పంపే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులోగా విచారణచేపట్టాలని సంబంధిత రికార్డుల పరిశీలనను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటరుజాబితా సవరణ ప్రక్రియలో భాగంగా సీనియర్ సిటిజన్లు ఉన్నట్లయితే వారి తరపున కుటుంబసభ్యులు ఎవరైనా నోటీసులు స్వీకరించి, దానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను అధికారులకు సమర్పించవచ్చు అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. విచారణ నిర్వహించే ప్రదేశాలలో తగిన ఏర్పాట్లయిన షెడ్లు, త్రాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతిమండలానికి సంబంధించిన ఎస్ఐఆర్ పూర్తినివేదికను మండలాలవారీగా ఏఈఆర్ఓలతో కలిసి ఆయన సమగ్రంగా సమీక్షించారు. కొడంగల్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను అదనపు ఎన్నికల అధికారి స్వయంగా సందర్శించి నోటీసులు జారీ చేసే విధానం, ఓటర్ల ఆధారాలను బిఎల్ఓలు యాప్‌లో అప్లోడ్ చేసే విధానంతో పాటు ఓటర్లతో ముచ్చటిస్తూ తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం నియోజక వర్గంలోని వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయడం జరిగింది.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు

-అసెంబ్లీలో అనుచిత పదజాలం, సైగల వీడియోల ప్రదర్శనతో రాజకీయ దుమారం

షాద్‌నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

తెలంగాణ శాసనసభ ఎథిక్స్ కమిటీ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీచేసిన నేపథ్యంలో, అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గతంలో అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తనపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎథిక్స్ కమిటీ అంశంపై స్పందిస్తూ, అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, మందుల సామేల్, షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడిన తీవ్రమైన పదజాలం, చేసిన అనుచిత సైగలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. ఈసందర్భంగా అధికారపక్ష సభ్యుల వ్యవహారశైలిపై కూడా ఎథిక్స్ కమిటీ విచారణ జరపాలా? అంటూ వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు.

ఒకవైపు పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు, ప్రవర్తనపై ఎథిక్స్ కమిటీ చర్యలు తీసుకుంటుండగా, మరోవైపు అదే సభలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల వ్యాఖ్యలు, ప్రవర్తనపై ఆరోపణలు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా వీర్లపల్లి శంకర్ పేరు ఎథిక్స్ కమిటీ అంశంలో ప్రస్తావనకు రావడం షాద్‌నగర్ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కౌశిక్‌రెడ్డికి నోటీసుల జారీతో మొదలైన వ్యవహారం ఇప్పుడు అధికార, ప్రతిపక్ష సభ్యుల సభాప్రవర్తనపై పరస్పర ఆరోపణలకు దారితీస్తోంది.

శంషాబాద్‌లో చోరీచేసిన బైక్ పట్టివేత

బైక్ స్వాధీనం చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు

శంషాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

శంషాబాద్ ఆర్టీఏ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో దొంగిలించిన ద్విచక్రవాహనం పట్టుబడింది. శనివారం ఆర్‌జిఐఎ ట్రాఫిక్ సిఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనతనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎపి 09 సిఎ5863 నంబర్‌గల ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీచేయగా, వాహనానికి సంబంధించిన సదరు వాహనదారులు ఎలాంటి పత్రాలను చూపించలేక పోయాడు. వివరాలను పరిశీలించగా సదరు మోటార్‌సైకిల్‌పై గోపాల్‌పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే గోపాల్‌పురం పోలీసులకు సమాచారం అందించి, తదుపరి దర్యాప్తు, చట్టపరమైన చర్యలనిమిత్తం మోటార్‌సైకిల్‌ను సంబంధిత పోలీసులకు అప్పగించారు.

మహిళపై దాడి..

-గొంతునులిమి మెడలోని పుస్తెలతాడు అపహరణ
-ఇంటి మాజీ పనిమనిషి భర్త ఘాతుకం

తాండూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:

వికారాబాద్ జిల్లా తాండూరులో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ మహిళపై ఇంటి పనిమనిషి భర్త దాడిచేసి ఆమె గొంతునులిమి మెడలోని పుస్తెలతాడు, నల్లపూసలదండను అపహరించి పారిపోయాడు. తాండూరులో పట్టపగలే జరిగిన ఈసంఘటన తీవ్ర కలకలంరేపింది. తాండూరు పట్టణంలోని బసవేశ్వర నగర్‌లో ఉమాదేవి, సుభాన్‌రెడ్డిలు నివాసముంటున్నారు. వారింట్లో బుజ్జమ్మ అనే మహిళ ఇంటిపనులు చేసేది. గత కొంతకాలంగా ఆమె ఆ ఇంట్లో పని మానేసింది. శనివారం బుజ్జమ్మ భర్త మొగులప్ప ఉమాదేవి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంటివద్ద ఒంటరిగా ఉన్న ఉమాదేవిపై అకస్మాత్తుగా దాడికి పాల్పడి ఆమె మెడలో ఉన్న నల్లపూసలదండ, పుస్తెలతాడును తెంపుకొని పారిపోయాడు. ఈ క్రమంలో ఉమాదేవి మెడపై గాయాలయ్యాయి. ఉమాదేవి కేకలువేయడంతో చుట్టుపక్కలవారు అప్రమత్తమై వెంటనే అక్కడికి చేరుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఉమాదేవిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పట్టణ సిఐ పరమేశ్వర్ ఆసుపత్రి వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తూంకుంటలో గంజాయి చాక్‌లెట్ల పట్టివేత

-పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ నిందితుడు అరెస్ట్, అతని భార్య పరారీ
-జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి వెల్లడి

ఎసిపి చక్రపాణి విలేకరులకు వివరిస్తున్న దృశ్యం, పాల్గొన్న సిఐ కె.నర్సింహ్మారెడ్డి, డిఐ మహేశ్‌ల సిబ్బంది దృశ్యం

శామీర్‌పేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:

తూంకుంటలో 24.59కిలోల గంజాయి చాక్‌లెట్లను శామీర్‌పేట పోలీసులు పట్టుకున్నారు. బిహార్‌కు చెందిన ఒవ్యక్తి (భార్యభర్తలు) తూంకుంటలో నివాసం ఉంటూ పాన్‌షాపు నడుపుతూ గంజాయి చాక్‌లెట్లను విక్రయిస్తున్న సమాచారంతో శామీర్‌పేట పోలీసులు నిఘాపెట్టి దాడులు నిర్వహించారు. వారు నివాసం ఉంటున్న ఇంట్లో గంజాయి చాక్‌లెట్లు నిల్వ ఉన్నట్లు, విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడులుచేశారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటపోలీస్‌స్టేషన్‌లో జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి విలేకరులతో మాట్లాడుతూ శామీర్‌పేట మండలం తూంకుంటలోని చంద్రారెడ్డి కాలనీలో బిహార్‌కు చెందిన బైద్నాద్‌కుమార్(29), అతనిభార్య పూజాకుమారిలు నివాసం ఉంటూ గ్రామంలో పాన్‌షాపును నడుతున్నట్లు తెలిపారు. వీరి స్వరాష్ట్రం బిహార్, జిల్లా సమస్తిపూర్, గంగౌలిగ్రామం అని అన్నారు. అయితే వీరు బిహార్ నుంచి గంజాయి చాక్‌లెట్స్‌ను సూట్‌కేసులో తీసుకువచ్చి తూంకుంటలోని ఇంట్లో వారు నిల్వ ఉంచినట్లు తెలిపారు. పోలీసులకు పక్కా సమాచారం అందటంతో వారి ఇంట్లో గంజాయి చాక్‌లెట్స్ ఉన్నట్లు భావించి పోలీసులు దాడులుచేసి పట్టుకున్నారు. ఈదాడిలో గంజాయి చాక్‌లెట్స్ 12కవర్స్‌లో 5,298 ప్యాక్ చేసి ఉన్నట్లు వీటి బరువు 24.59కిలోలు అని పోలీసులు తెలిపారు. వీరి వద్ద ఇంట్లో ఉన్న సూట్‌కేసులో గంజాయి చాక్‌లెట్స్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి చాక్‌లెట్స్‌తో పాటు సూట్‌కేసును, ఒక మొబైల్‌

నోటీసుల విచారణ ఎలా జరుగుతోంది?

నారాయణగూడలో ఆర్.వి.కర్ణన్ ఆకస్మిక తనిఖీ

ఓటర్ల గుర్తింపు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచన

విచారణ ప్రక్రియ పరిశీలిస్తున్న ఆర్.వి.కర్ణన్

హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభావార్త:

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ నోటీసుల విచారణను హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు శనివారం నారాయణ గూడలోని వెంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలు 2, 12లకు సంబంధించిన నోటీసుల విచారణ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కేసులను పద్ధతిగా పౌరులకు అనుకూలమైన రీతిలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్ల సమర్పించిన పత్రాలు, అభ్యర్థనలను జాగ్రత్తగా పరిశీలించాలని అలాగే విచారణ నిర్వహించేటప్పుడు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పత్రాల సమర్పణ, పరిశీలనపై పౌరులకు స్పష్టమైన సమాచారం అందించడంపై, అలాగే అర్హులైన ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడటంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విచారణలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, దరఖాస్తులను నిశితంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

క్యాడర్‌ను కలుపుకుని ముందుకు సాగాలి

-డివిజన్లలో కాంగ్రెస్ మరింత పటిష్టంగా తయారు కావాలి : బండి

ప్రకాశనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న బండి.

బేగంపేట ఆగస్టు 29,ప్రభాతవార్త

లీడర్లు క్యాడర్‌ను కలుపుకుని ముందుకు సాగాలని,గ్రేటర్ ఎన్నికల నాటికి కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ మరింత పటిష్టంగా తయారు కావాలని,కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పిలుపు నిచ్చారు. శనివారం అల్లంతోటబాయిలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గౌరపల్లి రమేష్ కార్యాలయంలో ప్రకాశనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దర్గ కరుణాకర్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో బండి రమేష్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలతో ప్రజాపాలన సాగిస్తుందని,ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను నేతలు,కార్యకర్తలు సమన్వయంతో ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని సూచించారు.డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలతో పాటు నేతలు కూడా తీసుకోవాలన్నారు.సీనియర్ల సలహాలు,సూచనలు కూడా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడే వెస్ట్‌మారేడ్‌పల్లి న్యూ క్లబ్ ఎన్నికలు

ముగ్గురు అభ్యర్థుల మధ్య అధ్యక్ష పదవికి పోటీ

కంటోన్మెంట్ ఆగస్టు 29, ప్రభాతవార్త:

కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలోని న్యూ క్లబ్ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. అధ్యక్ష పదవికి బాలకృష్ణ రెడ్డి, ప్రభాకర్ గౌడ్, సోముల ప్రకాష్ ముగ్గురు పోటీలో ఉన్నారు.కమిటీ సభ్యులుగా ఆనంద్ కుమార్ మానేపల్లి, నాగేందర్, నరేష్ రాజ్, పూర్ణచందర్, సాయి కుమార్ దుబ్బాక, వినయ్ కుమార్, విశాల్ సోమబద్రి బరిలో ఉన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని న్యూ క్లబ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.ఎస్. రామయ్య నాయుడు తెలిపారు.

బోధనలో కృత్రిమ మేధస్సు వినియోగం అవసరం

-డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి

ఓన్ యువర్ ఏఐ అంశంపై సదస్సులో పాల్గొన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి

చిక్కడపల్లి ఆగస్టు 29, ప్రభాతవార్త : మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా అధ్యాపకులు బోధనా విధానాల్లో కృత్రిమ మేధస్సు ను భాగస్వామ్యం చేసుకోవడం ఎంతో అవసరమని రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి పేర్కొన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థల పరిధిలోని డిగ్రీ, ఎంబీఏ, లా కళాశాలల బోధనా సిబ్బందికి ఓన్ యువర్ ఏ ఐ " అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సర్వం ఏ ఐ సహ వ్యవస్థాపకులు ప్రత్యూష్ కుమార్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. విద్యా రంగంలో ఏ ఐ ప్రాధాన్యం, బోధనా నాణ్యతను మెరుగుప రుచుకునే విధానాలు, భవిష్యత్ అవకాశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఏఐ సాధనాల ద్వారా సమయాన్ని ఏ విధంగా ఆదా చేసుకోవచ్చో వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, డిగ్రీ, ఎం బీఏ, లా కళాశాలల ప్రిన్సిపాళ్లు డా. శేఖర్ మట్ట, డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ సృజన కళాశాలల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బాబానగర్ లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికుల నుద్దేశించి ప్రసంగిస్తున్న ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జంగయ్య. సిఐటియు జోన్ కార్యదర్శి ఎస్.కిషన్లు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయ్యాయని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తామన్నారు.

ఇందిరాగాంధీ పురంలో రోడ్డు ఆక్రమణలు తొలగింపు

-ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చర్యలు : ఎసిపి శంకరరాజు

బేగంపేట ఆగస్టు 29,ప్రభాతవార్త

మల్కాజ్ గిరి కమీషనరేట్ పరిధిలోని ఇందిరాగాంధీ పురంలో రోడ్లను ఆక్రమించి వాహనదారులకు ఇబ్బందులు సృష్టిస్తున్న అడ్డంకులను శనివారం తిరుమల గిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ అధికారులు తొలగించారు.రోడ్లను ఆక్రమిస్తూ వాహనాల పార్కింగ్ చేయడం,కొందరు స్థానికులు రోడ్లపైనే పార్కింగ్ చేసి ఆ వైపు వాహన దారుల రాకపోకలకు ఆటంకం కల్గిస్తున్న విషయం తెల్సుకున్న ట్రాఫిక్ ఏసీపీ సిబ్బంది,క్రేన్‌తో పాటు ఆ ప్రాంతానికి చేరుకుని రోడ్డుపై అడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగింపజేసారు.కొందరు కట్టెలు,ఇతరత్రా సామాగ్రిని రోడ్డుపై వేయడాన్ని గమనించి వాటిని అక్కడి నుంచి తొలగింప జేసారు.ఈ సందర్భంగా ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ శ్యాంలాల్ బిల్డింగ్,ఇందిరాగాందీపురం మీదుగా ప్రయాణించే వాహనదార్లకు రోడ్డును బ్లాక్ చేస్తూ ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని,రోడ్లపై వాహనాలను అడ్డంగా పార్కింగ్ చేయవద్దని,ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని ఆయన హెచ్చరించారు.మల్కాజ్ గిరి సీపీ సుమతి నేతృత్వంలో ట్రాఫిక్ కు ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రయత్నిస్తున్నామని ఆయన తెలియజేసారు.ఇందిరాగాంధీ పురం వద్ద ఒక వైపు రోడ్లను ఆక్రమించి పార్కింగ్ చేస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆ ప్రాంతాన్ని సందర్శించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసామన్నారు.ఈ మార్గంలో తరచూ తనిఖీలు నిర్వహిస్తామని,ఎవరైనా రోడ్లను ఆక్రమించి పార్కింగ్ చేసినా బిల్డింగ్ మెటీరియల్ వంటివి వేసి జామ్ చేసినా అలాంటి వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఏసీపీ తో పాటు ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

ఫతేనగర్‌లో రోడ్డుపై ఉన్న ఆక్రమణలు,పార్కింగ్ చేసిన వాహనాలను తొలగిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు.

ఏఐ మాయలో పడొద్దు.. జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలి : సుధాకర్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:

కృత్రిమ మేధస్సు (ఏఐ) విస్తరిస్తున్న కొద్దీ తప్పుడు, వక్రీకరించిన సమాచార వ్యాప్తి కూడా పెరుగుతోందని, ఈ సవాలును ఎదుర్కొనేందుకు జర్నలిస్టులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫ్యాక్ట్‌చెకింగ్ సాధనాలతో నిరంతరం అప్‌డేట్ కావాలని సీనియర్ జర్నలిస్టు, టెక్నాలజీ నిపుణుడు ఉడుముల సుధాకర్ రెడ్డి సూచించారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం గూగుల్, డాటా లీడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ ప్రొవెనెన్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐ ద్వారా రూపొందించిన లేదా మార్చిన ఫొటోలు, వీడియోలు, ఆడియోలు, సమాచారాన్ని గుర్తించి ధృవీకరించే విధానాలను జర్నలిస్టులకు వివరించారు.ఏఐని వృత్తిపరమైన సహాయకుడిగా ఉపయోగించాలి కానీ మానవ విచక్షణకు ప్రత్యామ్నాయంగా భావించకూడదు" అని సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలు కొన్ని సార్లు వాస్తవం లేని సమాచారాన్ని సృష్టించే అవకాశం ఉందని, వీటినే హాల్యూసినేషన్స్ అంటారని తెలిపారు. ఏఐ ఇచ్చిన సమాచారాన్ని యథాతథంగా నమ్మి వార్తలు రాయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యమైన ప్రతి అంశాన్ని స్వతంత్రంగా ధృవీకరించడంతో పాటు, అవసరమైతే పలు ఏఐ మోడళ్లు, విశ్వసనీయ మానవ వనరుల ద్వారా క్రాస్‌చెక్ చేయాలని సూచించారు. మీడియా సంస్థల సంపాదకీయ ప్రమాణాలను కాపాడే తుది బాధ్యత జర్నలిస్టులదేనని పేర్కొన్న ఆయన.. నిరంతర అభ్యాసం, ఫ్యాక్ట్‌చెకింగ్ నైపుణ్యాలు, స్వీయ కేస్‌స్టడీల ద్వారా డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, వక్రీకరించిన కంటెంట్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు. ఈకార్యక్రమం అనంతరం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల,ఉపాధ్యక్షులు రాజేష్ ,అత్తలూరి అరుణ, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ తదితర ఎగ్జిక్యూ టివ్ కమిటీ సభ్యులు వనం నాగరాజు,దయ్యాల అశోక్, కస్తూరి శ్రీనివాసులు సుధాకర్ రెడ్డిని సన్మానించి అభినందించారు.

శిక్షణా కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులతో సుధాకర్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ బృందం

గణేశ్ ఉత్సవాల ముందస్తు సమన్వయ సమావేశం

శేరిలింగంపల్లి, అగస్టు 29 ప్రభాతవార్త: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను,నిమజ్జన వేడుకలను ప్రశాంతవాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఉన్నత స్థాయి ముందస్తు సమన్వయ సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌నారాయణ అమిత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఎంసీ ,పోలీస్, ట్రాఫిక్, హైడ్రా,నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి,జలమండలి, తదితర అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరై పలు కీలకమైన ఆంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ.. నగరంలో ప్రతిష్టాత్మకంగా జరిగే గణేశ్ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై శ్రద్ధ తీసుకోవాలని, ఉత్సవాల సమయంలో ఏలాంటి అవాంఛనీయన సంఘటనలు జరుకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన ఊరేగింపుల రూట్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. చెరువుల పరిరక్షణ, నిమజ్జన ఏర్పాట్లు వంటి అంశాలపై హైడ్రా, నీటి పారుదల శాఖలు సంయుక్తంగా నిమజ్జన చెరువుల వద్ద తగిన చర్యలు చేపట్టాలని, చెరువుల పార్యవరణం దెబ్బతినకుండా చూస్తునే భక్తులకు నిమజ్జనానికి ఇబ్బందిలేకుండా క్రేన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా ఆర్‌అండ్ బి , జిహెచ్‌ఎంసీ ఇంజనీరింగ విబాగాలు గణేశ్ విగ్రహాల ఊరేగింపు సాగే ప్రధాన రహదారులలోని గుంతలను వెంటనే పూడ్చివేయాలని అవసరమైన చోట రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు.నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిమజ్జనం రోజున ఎక్కడా విద్యుత్ అంతరాయం కలుగకుండా చూసేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక ట్రాన్స్ ఫార్మర్లను,అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని,కరెంట్ వైర్లను సరిచేయాలని స్పష్టం చేశారు. ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతయుతంగా పనిచేయాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా సర్కిళ్ల ఉప కమిషనర్లు,అధికారులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయంలో గణేశ్ ఉత్సవాల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్

ద్వైతంగల తెలుగుభాష ఔన్నత్యాన్ని నిలుపుకోవాలి : ఏనుగు నరసింహారెడ్డి

రవీంద్రభారతి, ఆగస్టు 29 ప్రభాతవార్త : 200 దేశాలున్న ఈ ప్రపంచంలో మనకన్నా 15 పెద్దభాషలు మాత్రమే ఉన్నాయని, భారతదేశంలో 10 ప్రభావంతమైన భాషల్లో మన తెలుగును తీసేసారని, యావత్ తెలుగు జాతి కృషిచేసి ద్వైతంగల తెలుగుభాషా ఔన్నత్యాన్ని నిలుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. అయితే నేటి వాడుకభాష ఇలా ఉందంటే దానికి కారణం గిడుగు రామ్మూర్తి పంతులు అని ఆయన తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మాతృ భాషా సమితి (తెలుగుభాషా చైతన్య సమితి) ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం రవీంద్రభారతిలోని సమావేశమందిరంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి డా. ఏనుగు నరసింహారెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశానికి స్వతంత్ర్యం వచ్చినప్పుడు దేశంలో రెండో అతిపెద్ద భాషైన తెలుగు మన పాలకులు, తల్లిదండ్రుల వల్ల 4వ స్థానానికి పడిపోయిందని, తెలుగురాష్ట్రాలలో కనీసం ఒక భాషగా అయిన తెలుగు నేర్పుతామంటే వద్దనివెప్పి ఈ మధ్యన సొంతలిపి కూడా లేకి హిందీకి సంబంధించిన వాళ్లు హైదరాబాద్‌లో ధర్నాలు చేయడం బాధాకరమని, ఒక భాష నశిస్తే ఆజాతి అస్తిత్వం నశిస్తుందని చలసాని శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి మాట్లాడుతూ పిల్లలు తమ తెలుగుభాష గొప్పదనాన్ని తిరిగి నిలుపుకోవాలని ఉద్బోధించారు. గత నాలుగు దశాబ్దాల సంస్థ ప్రస్తానాన్ని అధ్యక్షురాలు డా. వసుంధరరెడ్డి సభకు సవివరపరిచారు. సభాకార్యక్ర మాన్ని డా. సుధారాణి నిర్వహించగా కార్యదర్శి విజయ కుమార్, బడేసాబ్, మాధవి, డా. సరోజిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు అతిథుల చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న నరసింహారెడ్డి, సుధారాణి, చలసానిశ్రీనివాస్, బాలాచారి తదితర అతిథులు

ఓటుహక్కు మన బాధ్యత : టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి, అగస్టు 29 ప్రభాతవార్త ఓటుహక్కు ప్రతి పౌరుని హక్కని, ఓటును రక్షించుకోవడం మన బాధ్యతగా భావించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2 కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, సర్ ఇంచార్జి జ్ఞానేశ్వర్, గాంధీ భవన ప్రత్యేక ఆహ్వానితులు జగదీశ్వర్, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారావు,ఛైర్మన్లు, శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఓలతో కలిసి సమావేశం ఏర్పాటు చేవారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. కొత్తగా అర్హత పొందిన ప్రతి ఓటరు తమ పేర్లను నమోదు చేయించటం మన ప్రధాన లక్ష్యమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యానికి చేరువగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ఓటర్ల జాబితాలో అర్హులైన వారు ఎవరూ మిగిలిపోకుండా, అనర్హులు చేర్చబడకుండా చూడాలన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు సూచనలు చేశారు. ప్రతి బూత్‌లో ఓటర్ లిస్ట్‌ను పూర్తిగా పరిశీలించాలని, ప్రతి ఇంటికి వెళ్ల ఓటరు వివరాలను దృవీకరించాలని, 18 ఏళ్ల పూర్తయిన యువత పేర్లు నమోదు చేయించాలని, ఓటరు పేరు లేకపోతే ఫారం 6 ద్వారా నమోదు చేయించాలని, పేరు, చిరునామా,ఇతర వివరాల్లో తప్పులు ఉంటే అవసరమన సవరణ ప్రక్రియ చేపట్టాలని, ప్రతి బిఎల్ఓ తన బూత్‌లో ఒక్క ఓటును కూడా నిర్లక్ష్యం చేయకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి ఓటర్ లిస్టులో పేరు ఉందో లేదో నిర్ధారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు,డివిజన్ అధ్యక్షులు, బ్లాక్, మండల నాయకులు, ఐఎన్‌టీయుసీ, టీపీసీసీ, లేబర్ సెల్, యువజన కాంగ్రెస్,మహిళా కాంగ్రెస్, సేవాదళ్, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

తల్లిదండ్రుల నిరంతర స్మరణే నిజమైన దైవ ఆరాధన: కె.వి.రమణాచారి

చిక్కడపల్లి ఆగస్టు 26 ప్రభాతవార్త : తన ఉనికికి, ఉన్నతికి కారణభూతులైన తల్లిదండ్రులను నిరంతరం స్మరించుకోవడమే నిజమైన దైవ ఆరాధన అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. 87 ఏళ్ల వయసులోనూ సత్సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సమాజంలోని ప్రముఖులను పురస్కారాలతో సత్కరిస్తున్న ప్రముఖ సినీ జర్నలిస్ట్ ఎస్.వి. రామారావు నేటి తరానికి ఆదర్శమూర్తి అని కొనియాడారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో సినీ విజ్ఞానవిశారదా ఎస్.వి. రామారావు జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా తన తల్లిదండ్రులు చంద్రమౌళేశ్వరరావు, కామేశ్వరమ్మల జ్ఞాపకార్థం నెలకొల్పిన పురస్కారాలను ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్‌కు జీవిత సాఫల్య పురస్కారం బహూకరించగా, కంప్యూటర్ సైన్స్ విభాగంలో శతాధిక గ్రంథాలు రచించిన డాక్టర్ ఎస్.బి. కిశోర్, రంగాస్థల ప్రముఖులు నామాల మూర్తిలకు ప్రతిభా పురస్కారాలు ప్రధానం చేసిన అనంతరం కెవి రమణాచారి మాట్లాడుతూ వైద్య రంగంలో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో మెడికల్ హబ్‌గా ఎదిగిందని, డాక్టర్ సూర్యప్రకాష్ సేవలు, ఆయన ప్రతిభ ఎనలేనివని ప్రశంసించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దూరదర్శన్ పూర్వ సంచాలకుడు డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఎస్.వి. రామారావు తెలుగు సినిమా చరిత్రను పోషించిన నడిచే సినీ విజ్ఞాన గని అని అభివర్ణించారు. సత్కారాన్ని స్వీకరించిన ఎస్.వి. రామారావు మాట్లాడుతూ సమాజం పట్ల నిరంతర బాధ్యతతో మెలగడమే తన ధ్యేయమని, తాను సంతోషంగా ఉంటూ ఇతరుల ముఖాల్లో చిరునవ్వులు నింపడమే జీవిత సార్థకత అని సభాపూర్వకంగా తెలిపారు. ప్రముఖ సీనియర్ నటుడు సుబ్బరాయ శర్మ, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్‌అం, సుబ్బారావు, జె. రాధాకృష్ణ, వెంకట్ రావు, విజయకుమార్,మల్లాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సభా కార్యక్రమానికి ముందు ఎస్.వి. రామారావు రచించిన పేరులోనే పెన్నిధి హాస్య నాటికను నామాల మూర్తి సమర్థవంతమైన దర్శకత్వంలో నటులు కుటుంబ శర్మ, మల్లాది భాస్కర్ తదితరులు ప్రదర్శించి ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. అనంతరం గీతాలయ ఆర్ట్స్ సమర్పణలో, మోహనకృష్ణ చక్కటి వ్యాఖ్యానంతో సి.హెచ్. మూర్తి బృందం ఆలపించిన మధురమైన సినీ గీతాల విభావరి శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది.

ప్రముఖ వైద్యులు డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్‌కు జీవిత సాఫల్య పురస్కారం, డాక్టర్ ఎస్.బి. కిశోర్, నామాల మూర్తి లకు ప్రతిభా పురస్కారాలను ప్రధానం చేస్తున్న డాక్టర్ కెవి రమణాచారి

అపురూపం అక్షిత భరతనాట్య విన్యాసం

రవీంద్రభారతి, ఆగస్టు 29 ప్రభాతవార్త : ప్రముఖ వర్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు, నాట్యగురు సంస్థ డైరెక్టర్ డా. స్మితామాధవ్ శిష్యురాలు అక్షితశర్మ భరతనాట్య ఆరంగేట్రం అపురూపంగా సాగింది. భారతీయ శాస్త్రీయ నృత్యం భరతనాట్యంపై ఆసక్తి అభిరుచితో పిన్నవయస్సులోనే ఉమారాధ వద్ద ప్రాథమిక శిక్షను ప్రారంభించి అనంతరం గురువు స్మితమాధవ్, భార్గవి పరమేశ్వరన్ శిక్షణలో అంకితభావంతో భరతనాట్యాన్ని సంపూర్ణంగా అభ్యసించడంతోపాటు శాస్త్రీయ కర్ణాటక సంగీతం, చిత్రలేఖనంలలో కూడా ప్రావీణ్యతపొంది బహుమతులు అందుకోవడం విశేషం. ఈ రోజు తన భరతనాట్య ఆరంగేట్రంను ముందుగా పుష్పాంజలి అంశంతో ప్రారంభించి ఖరహరప్రియ రాగం ఆదితాళంలో తిరుపుగజ్-సంతతం బండ తొడరలే; వర్ణం-నిన్నేనేర నమ్మి; ధరణి మండల (పుణ్యకోటి కథ); తిల్లానా; చివరిగా పాహి రామప్రభో మంగళం అంశంతో భరతనాట్య ఆరంగేట్రంను ముగించి విచ్చేసిన అశేష కళాప్రియుల ప్రశంసలు అందుకుంది. కొరియోగ్రఫీ, గాత్రం, నట్టువాంగం గురు డా. స్మితమాధవ్; సంగీత దర్శకత్వం-వయోలిన్ ఎంబర్ ఎస్ కన్నన్; మృదంగం ఆర్. కార్తికేయన్; వేణువు జె.బి.శృతిసాగర్; వీణ టి.భవానీ ప్రసాద్‌లు అద్భుత వాద్యసహకారం అందించి అక్షితశర్మ భరతనాట్య ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ అతిథులు కళాకారిణి అక్షితను ఎంతగానో అభినందించి శుభాశీస్సులందజేసి భవిష్యత్తులో గొప్ప నాట్యకళాకారిణి పేరుప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షించారు.

అక్షితశర్మ భరతనాట్య ఆరంగేట్రంలో ఒక దృశ్యం

సంచార జాతులకు ప్రభుత్వం విముక్త దివాస్‌ను నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మీనగ గోపిబోయ

సైఫాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త: బ్రిటిష్ కాలంనాటి క్రూరమైన 'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్-1871' రద్దయి సంచార జాతులకు స్వేచ్ఛా లభించిన ఆగస్టు 31వ తేదీని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'విముక్త దివాస్' గా గుర్తించి ఘనంగా నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, సంచార విముక్త జాతుల ఐక్య వేదిక జెఎసి కన్వీనర్ మీనగ గోపిబోయ విజ్ఞప్త

ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

-శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైభవంగా లక్షతులసి అర్చన



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొడంగల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

శ్రావణమాసాన్ని పురస్కరించుకొని దేవాలయాల్లో ప్రత్యేక పూజలతో శ్రావణశోభ సంతరించుకుంది. ఉపవాస దీక్షలతో భక్తులు దేవాలయాలకు వెళ్ళి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. కొడంగల్ శ్రీమహలక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసపూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రావణమాసం మూడవ శనివారంను పురస్కరించుకొని ఆలయంలో లక్షతులసి అర్చన కార్యక్రమం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా కొనసాగింది. శనివారం బాలాలయంలో స్వామివారికి విశేష అలంకరణలతో పూజలు నిర్వహించగా కొడంగల్ పరిసర గ్రామాల ప్రజలతో పాటు తాండూర్,వర్గి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. లక్షతులసి అర్చన కార్యక్రమంలో భాగంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా ఎన్సిసి విద్యార్థులు తగు భద్రత ఏర్పాట్లుచేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామస్వామితోపాటు వేదపండితులు ధరూరీ శ్రీనివాసాచార్యులు, కిట్టుస్వామి, వెంకటస్వామి, జనార్దన్‌లతోపాటు ఆలయధర్మకర్తలు నందారం రత్నం, నందారం ప్రశాంత్,నందారం మధు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో...

శ్రావణమాసం మూడవ శనివారంను పురస్కరించుకొని స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.స్వామివారి విశేష అలంకరణలతో అభిషేక పూజల్లో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.స్వామివారి అభిషేక పూజలు భక్తుల కొలహలం మధ్య వైభవంగా నిర్వహించారు.

విద్యాబోధనలో రాధాకృష్ణ సేవలు శ్లాఘనీయం

రాధాకృష్ణ దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

అధ్యాపకుల మార్గదర్శకతంతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ గురుకుల్ జూనియర్ కళాశాలలో శనివారం సివిక్స్ అధ్యాపకులు రాధాకృష్ణ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. యజ్ఞశాలలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి విచ్చేసి రాధాకృష్ణ దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. గురుకుల్‌లో ఇంటర్ విద్యార్థులకు గత కొన్ని సంవత్సరాలుగా అధ్యాపకులు రాధాకృష్ణ పౌరశాస్త్రం భోధించి అనేక విషయాలను తెలియజేశారని పేర్కొన్నారు. ఉద్యోగ నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో పనిచేసే అధ్యాపకులకు విద్యార్థుల నుంచి సానుకూల దృక్పథం వస్తుందని తెలిపారు. ఈసందర్భంగా పలువురు అధ్యాపకులు, విద్యార్థులు రాధాకృష్ణను సన్మానించి జ్ఞాపికలను అందజేసి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు వి.వెంకట్‌రాంరెడ్డి, జిపిఎస్ సభ్యులు ఎండి.సిరాజ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటమైసమ్మతల్లి దేవాలయం తృతీయ వార్షికోత్సవ ఆహ్వానం

ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

షాద్‌నగర్‌లోని కోట మైసమ్మ తల్లి దేవాలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా రేపు దేవాలయం ఆవరణ లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామురూ. ఈ పవిత్ర కార్యక్రమానికి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కోట మైసమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. ఈ సందర్భంగా షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ను ఆహ్వానించిన దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మురళీ మోహన్ అప్పి, పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్,మంగ మధు కాలనీవాసులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో ఓబిసి కులగణనపై సమావేశం

-టిపిసిసి ఓబిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరు

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయం (గాంధీభవన్)లో ఈరోజు ఓబీసీ కులగణనపై కీలక సమావేశం జరిగింది.బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రొఫెసర్ కంచె ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు వీర్లపల్లి శంకర్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, క్రమశిక్షణ కమిటీ కోచైర్మన్ శ్యామ్ కుమార్, మాజీ మేయర్ రామ్మోహన్, రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీసీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ కులగణన, బీసీలకు సామాజిక న్యాయం, జనాభా ప్రాతిపదికన హక్కులు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు సమావేశానికి హాజరయ్యారు.

విద్యార్థులకు మంచి విద్యావాతావరణం

-వైస్ ఛాన్సలర్ అర్చన మంత్రి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

విద్యార్థులకు మంచి విద్యావాతావరణాన్ని అందించడానికి అనురాగ్ యూనివర్శిటీ కృషిచేస్తుందని వైస్ ఛాన్సలర్ అర్చన మంత్రి అన్నారు. పోచారం డివిజన్ అనురాగ్ యూనివర్శిటీలో బీబీఏ 6వబ్యాచ్ ఓరియేంటేషన్ కార్యక్రమం శనివారం జరిగింది. హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ విష్ణు వందన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంటు డైరక్టర్ సిద్ధార్థ ఘేష్, గ్లోబల్ ఆఫైర్స్ డైరక్టర్ అంకితా టుటేజా, ప్రొఫెసర్ ఎం.ముత్తారెడ్డి, డైరక్టర్ ఆఫ్ ఆడ్మిషన్స్ ఎం.శ్రీనివాస్‌రావు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంటు డీన్ బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ మండలంలో అభివృద్ధి పనుల జోరు

దౌల్తాబాద్, అగస్టు 29, ప్రభాతవార్త:

-అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారంచుట్టిన కాంగ్రేస్ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి



నీటూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, మండల నాయకులతో కలిసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కడా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో మండలంలోని నీటూర్‌గ్రామంలో రూ.20.00 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు, అంత్వార్‌గ్రామంలో రూ.25.00లక్షల వ్యయంతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే గోకుల్‌ఘస్లబాద్ గ్రామంలో రూ.25.00లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ.10.00లక్షల వ్యయంతో వెటర్నరీ (పశువైద్య) భవన నిర్మాణ పనులకు, నాగసార్ గ్రామంలో ర.30.00లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు వారు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్పొరేషన్‌లో రొంపల్లికి చాన్స్

-సిఎం రేవంత్‌రెడ్డి హామీ



సిఎం కలిసిన రొంపల్లి సంతోష్

వికారాబాద్‌జిల్లాప్రతినిధి, ఆగస్టు29, ప్రభాతవార్త:

రాష్ట్ర కార్పొరేషన్ పదవుల్లో తాండూరు యువనేత రొంపల్లి సంతోష్ కుమార్‌కు అవకాశం కల్పిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి ముందుగా ఎంపి వేంనరేందర్‌రెడ్డి వద్దకు తీసుకెళ్ళి అక్కడి నుంచి నేరుగా సిఎం నివాసానికి వెళ్ళారు. పార్టీకి ఎనలేని సేవలు అందిస్తున్న సంతోష్‌కు నామినేటేడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని వేం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. అందుకు సిఎం సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు.

కంది సాగుతో రైతులకు ప్రయోజనం

-ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

కందిసాగులో శాస్త్రీయపద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిలు రైతులకు సూచించారు. శనివారం షాబాద్ రైతు వేదికలో మిషన్ ఫర్ ఆత్మనిర్భర్ ఇన్ పల్సెస్ (ఎం.ఏ. ఎన్. పీ)-2026-27 పథకం కింద నిర్వహించిన కంది పంట క్లస్టర్ ఆధారిత ప్రదర్శన, ఇన్‌పుట్‌ల పంపిణీ కార్యక్రమంలోజిల్లా వ్యవసాయ అధికారిణి సుజాత, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, టెక్నికల్ ఏడీఏ పద్మజ, చేవెళ్ల ఏడీఏ సురేష్ బాబు, కేవీకే హయత్‌నగర్ శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ తదితరులతో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కందిసాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారులు సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అందించే సాంకేతిక సలహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంతారం గ్రామంలో పథకంకింద సాగుచేస్తున్న కంది పంటలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర, సర్పంచులు అశోక్, సబిత గోవర్ధన్‌రెడ్డి, లావణ్య చెన్నయ్య, పెంటయ్య, నవనీతస్వామి, సందీప్‌గౌడ్, స్వరూప మహేందర్‌గౌడ్, స్వాతిమాణిక్యం గౌడ్, పద్మమ్మగోపాల్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మగుట్ట డైరక్టర్‌గా జగన్ ప్రమాణ స్వీకారం

ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్ డివిజన్ శ్రీగట్టుమైసమ్మగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులుగా మేకల జగన్‌యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం దేవాలయ ప్రాంగణంలో ఆయన అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ జగన్‌చేత పత్రంచదివించి ప్రమాణంచేయించారు. ఈసందర్భంగా జగన్‌ను నాయకులు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి లగడపాటి భాగ్యలక్ష్మి, ఆలయ డైరెక్టర్లు బర్ల దేవేందర్‌ముదిరాజ్, పోట్లచెరువు నాగరాజు, బొక్క జంగారెడ్డి, కడపోళ్ళ హేమలతసుధాకర్, డిసిసికార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్, ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, డీసీసీ మాజీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు యాదవ్, మాజీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, నాయకులు అబ్బుసాని అంజయ్యయాదవ్, దయ్యాల కొమురయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

-ఎంపిడిఓ తిరుమలస్వామి

విచారణ జరుపుతున్న యంపిడిఓ

పెద్దేముల్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పెద్దేముల్ మండల యంపిడిఓ తిరుమలస్వామి అన్నారు. శుక్రవారం వివిధ దినపత్రికలో పాఠశాలలపై వచ్చిన కథనాలకు శనివారం మండల పరిధిలోని 12 పాఠశాలకు వెళ్ళి విచారణ జరపడం జరిగిందని తిరుమలస్వామి చెప్పారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలను వదిలి వెళ్లకూడదని సూచించారు. ఇట్టి విచారణ చేసిన రిపోర్టును ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మండల విద్యాధికారి నర్సింగ్‌రావు ఉన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ గోవు అంజమ్మ మృతి

-ఎమ్మెల్యే, రాష్ట్రప్రభుత్వరంగసంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి

షాద్‌నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

నందిగామమండలం రంగాపూర్ గ్రామ సర్పంచ్ గోవు అంజమ్మ శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆమెమృతిపట్ల షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్రప్రభుత్వరంగసంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోవు అంజమ్మ ప్రజాసేవలో నిత్యం నిమగ్నమై గ్రామ ప్రజలకు సేవలందించారని, ఆమెమృతి గ్రామానికి, కుటుంబసభ్యులకు తీరని లోటని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గోవు అంజమ్మ ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రైతు వేదికలో రాజకీయ రగడ

-రైతు సమావేశంలో నేతల మధ్య వాగ్వాదం

-వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కాలే యాదయ్య అభ్యంతరం..

షాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

షాబాద్ రైతు వేదికలో శనివారం నిర్వహించిన మిషన్ ఫర్ ఆత్మనిర్భర్త ఇన్ పల్సెస్ (ఎం.ఏ.ఎన్. పీ)2026-27 కార్యక్రమంలో భాగంగా కంది పంట క్లస్టర్ ఆధారిత ప్రదర్శన కార్యక్రమం సందర్భంగా రాజకీయ వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతుల సమక్షంలో ఇరువురు నేతలు పరస్పరం అభ్యంతరాలు వ్యక్తం చేసుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకోసం అనేకసంక్షేమపథకాలు, రాయితీలు అమలుచేస్తున్నారని అన్నారు. గతంలో రైతులకోసం ఇలాంటి కార్యక్రమాలు, రాయితీలు అందలేదని పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే కాలే యాదయ్య అభ్యంతరం వ్యక్తంచేశారు. గతంలోనూ రైతులకోసం అనేక పనులు చేశామని, తాను గత 13 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానని తెలిపారు. రైతు వేదికల నిర్మాణంతో పాటు సబ్సిడీపై ట్రాక్టర్లు అందించినట్లు చెప్పారు. గతంలో రైతుల కోసం ఎలాంటి పనులు చేయలేదని చెప్పడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మధుసూదన్‌రెడ్డి స్పందిస్తూ.. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను చెప్పడం తప్పేమీ కాదని, తాను మాట్లాడిన విషయాలను తప్పుబట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో రైతులకోసం ఇలాంటి సమావేశాలు నిర్వహించారా? రైతులకు వివిధ పథకాల కింద రాయితీలు అందించారా? అని ప్రశ్నించారు. ఈక్రమంలో సభలో కొంతసేపు వాగ్వాదంనెలకొంది. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు జోక్యం చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను చెప్పుకోవడంలో తప్పేముందని పేర్కొన్నారు. దీంతో వాతావరణం కొంత ఉద్రిక్తంగా మారింది.అనంతరం ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రైతులకు సంక్షేమ పథకాలు, రాయితీలు లేవని చెప్పడం వేరు, గతంలో రైతుల కోసం ఎలాంటి పనులు జరగలేదని చెప్పడం వేరు అని స్పష్టం చేశారు. తాను 13 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నానని, రైతులకోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కొద్దిసేపటి అనంతరం మధుసూదన్‌రెడ్డి కార్యక్రమాన్ని కొనసాగించడంతో పరిస్థితి సద్దుమణిగింది. రైతులకు పంటసాగులో సూచనలు, సలహాలు అందించాల్సిన కార్యక్రమంలో రాజకీయ వాగ్వాదం చోటుచేసుకోవడంతో వ్యవసాయ అధికారులు, రైతులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. ఘటనపై స్థానికంగా రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది.

నేడు ఘట్‌కేసర్‌లో బోనాల పండుగ

ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీకగా జరుపుకునే బోనాల ఉత్సవాలు ఆదివారం ఘట్‌కేసర్‌లో జరుగనున్నాయి. ఘట్‌కేసర్ పట్టణంలోని గ్రామదేవతల ఆలయాలను మామిడి, వేపతోరణాలు, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మున్సిపల్ సిబ్బంది పట్టణంలో పారిశుధ్య పనులు చేసి అవసరమైనచోట్ల వీధిదీపాలు వేశారు. సాయినగర్, రాంనగర్, అంబేద్కర్ నగర్, బాలాజీనగర్, గాంధీనగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, మేడిపాటినగర్, ఎస్ఆర్ నగర్, టీచర్స్‌కాలనీ తదితర కాలనీల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామదేవతలు పోచమ్మ, ఎల్లమ్మ, మహంకాళీ, మైసమ్మ, ఈదమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద ఆలయ కమిటీ నిర్వహకులు తగిన ఏర్పాట్లు చేశారు. బోనాల సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టణంలో పలుచోట్ల అధిక సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. పట్టణంలో పూలదండలు, కొబ్బరికాయలు, కిరాణ సామాగ్రి కొనుగోళ్లతో మార్కెట్ రద్దీగామారింది. ఆదివారం మద్యం, మాంసం, చికెన్ అమ్మకాలు మరింత పెరుగనున్నాయి.

పిఎస్‌బిని పశువుల ఎరువులో కలిపి చల్లాలి



ఎదులాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

పిఎస్‌బి భూమిలో నిల్వ ఉండిపోయిన కరగని భాస్వరాన్ని కరిగించి మొక్కల వేర్లు సులభంగా పీల్చుకునే రూపంలోకి మారుస్తుందని ఆత్మ ప్రాజెక్టు డైరక్టర్ మధుమోహన్ తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో శనివారం వ్యవసాయ సాంకేతిక యూజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పిఎస్‌బి వినియోగంపై అవగాహన కల్పించారు. ఘట్‌కేసర్ సహకార సంఘం డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి పొలంలో ఆత్మ పీడీ మధుమోహన్ పిఎస్‌బి వినియోగించే విధానంపై డెమోన్‌స్ట్రేషన్ ఇచ్చారు. పాస్పరస్ సొలుబిలిసి బ్యాక్టీరియా మందును అవసరంపై వివరించారు. నానోయూరెస్, నానోడిఏపి, చాలేటెడ్ జింక్, కార్బొఫ్రామ్ గుళికలను పీడీ అందించారు. నేలలో సూక్ష్మజీవుల కార్యకలాపాలను పెంచి, భూమిని గుల్లగా, సారవంతంగా ఉండేవిధంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లావణ్య, ఏఈఓ మంజుల, సొసైటీ మాజీ డైరక్టర్ జవాజి సత్తయ్య, రైతులు జాల రాజ్‌కుమార్, పూల నాగులు, బేల కిష్టయ్య, కొండల రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి సంతాపం వ్యక్తంచేసిన పలువురు రాజకీయ ప్రముఖులు

నందిగామ, ఆగస్టు 29, ప్రభాతవార్త:

నందిగామ మండలం రంగాపూర్ కాంగ్రెస్‌పార్టీ సర్పంచ్ గోవు అంజమ్మ(83) శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందిన సమాచారం తెలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి సల్వేంద్రిగూడ చేరుకొని అంజమ్మ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమెమృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తంచేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సంతాపం తెలిపినవారిలో మాజీఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మాజీ ఎంపీపీ ఏం.శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ వై.రవీందర్‌యాదవ్, మాజీ జెడ్పి వైస్‌చైర్మన్ ఈటగణేష్, సర్పంచ్‌లు కొమ్ము కృష్ణ, గ్రబు చౌహాన్, రమావత్ మారు రాజునాయక్, గొర్లపల్లి అశోక్, జట్ట కుమార్, మాజీసర్పంచ్ ఏనుగొండ రమేష్‌గౌడ్, జటావత్ రాజునాయక్, పిఏసిఎస్ చైర్మన్ రాజుగోపాల్, సింగిల్ విండో చైర్మన్ పసుల బుచ్చయ్య, మాజీ చైర్మన్ ఎం విటల్, ఎంపీఓ చక్రధర్‌గౌడ్, ఆయాశాఖల అధికారులు, పలువురు ప్రముఖులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి

డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శంషాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ సిఐ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. శంషాబాద్ ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరైవ్ అలైవ్‌లో కార్యక్రమంలో భాగంగా శనివారం ట్రాఫిక్ సిఐ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్జీఐ ఎయిర్‌పోర్టులో ఓలా, ఉబర్, ర్యాపిడో, స్కై, ఛాయిస్, శ్రీనివాస తదితర క్యాబ్ డ్రైవర్లతో మాట్లాడి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, సీటుబెల్ట్ ధరించకపోవడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనల వల్ల జరిగే ప్రమాదాలపై వివరించారు.క్యాబ్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు భద్రతా చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. అంతేకాకుండా తమ కుటుంబసభ్యులకు కూడా సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

రైతులకు తీవ్ర నష్టం కలిగించవద్దు

-రైతులకు నష్టం జరగకుండా చూస్తాం: తహసీల్దార్ అన్వర్

మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ అన్వర్, ఆందోళన చేస్తున్న రైతులు

షాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

రేడియల్ రోడ్డు కూడలి ఏర్పాటులో తమకు అన్యాయం చేయొద్దంటూ రైతులు ఆందోళనకు దిగారు. రోడ్డుకు ఒకవైపు ఉన్న భూములను వదిలి మరోవైపు చిన్న, సన్నకారు రైతుల భూములను మాత్రమే సేకరించడం సరికాదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డుకు ఇరువైపులా సమానంగా భూమిని సేకరించి కూడలి ఏర్పాటు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అధికారులను కోరారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్ వరకు ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్డులో భాగంగా షాబాద్ మండలం సంకేపల్లిగూడ గ్రామంవద్ద కూడలి ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ అధికారులు సుమారు 46 ఎకరాల 21 గుంటల భూమిని సేకరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం

బిజెపి జిల్లా అధ్యక్షులుగా రమేష్‌కుమార్

-కార్యక్రమానికి హాజరుకానున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న యు.రమేష్‌కుమార్

తాండూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:

బిజెపి వికారాబాద్ జిల్లా అధ్యక్షునిగా యు.రమేష్‌కుమార్ నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. పట్టణంలోని వీరశైవ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేయనున్న బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నట్లు శనివారం మీడియాకు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు ఛిద్రం

-హెడ్ కానిస్టేబుల్ ఖిజాఖాన్

కుల్కచర్ల, ఆగస్టు 29, ప్రభాతవార్త:

మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు ఛిద్రమవుతుందని హెడ్ కానిస్టేబుల్ ఖిజాఖాన్ అన్నారు. శనివారం మండల పుట్టాపహాడ్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, గ్రామప్రజలకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో గౌరవమర్యాదలు కలిగి ఉండేలా విద్యార్థిదశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టేందుకు విద్యార్థిదశనుంచి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. గంజాయిపై ఉక్కుపాదమోపుతూ పెద్దసంఖ్యలో కేసులు నమోదుచేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమపిల్లలపట్ల జాగ్రత్తవహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేంద్ర బహూదూర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోలీమేరీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న అధ్యక్షులు వరప్రసాద్‌రెడ్డి

కీసర, ఆగస్టు 29, ప్రభాతవార్త:

హోలీమేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణరాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారులు శివధర్‌రెడ్డి ఐపిఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యా ప్రస్థానాన్ని పూర్తిచేసుకుని వృత్తిజీవితంలోకి అడుగుపెడుతున్న సమయంలో జ్ఞానం, నైపుణ్యాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను తమజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. గౌరవఅతిథి డాక్టర్ జెఎంరావు మాట్లాడుతూ సాధించిన జ్ఞానాన్ని వాస్తవజీవిత సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. ప్రిన్సిపల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాల వార్షికనివేదికను సమర్పిస్తూ హోలీమేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ 1994-95లో ఎంసిఎలో 30మంది విద్యార్థులతో ప్రారంభమైన విద్యాప్రస్థానం నుంచి నేడు యుజిసి అటానమస్ హోదాతో అభివృద్ధి చెందిన విద్యాసంస్థగా ఎదిగిన విదానాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు అరమింద వరప్రసాద్‌రెడ్డి, చైర్మన్ అరమింద సిద్ధార్థరెడ్డి, సెక్రటరీ శారదారెడ్డి, డైరెక్టర్ ప్రీతిరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐను సన్మానించిన మండలకాంగ్రెస్ నాయకులు

ఎస్‌ఐను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

కేశంపేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:

కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్‌ఐగా పరమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలుస్వీకరించిన ఎస్సై పరమేశ్వర్‌ను కేశంపేటమండల కాంగ్రెస్‌నాయకులు శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిఐ నరహరి, కొండారెడ్డిపల్లి సర్పంచ్ పల్లె ఆనంద్‌కుమార్, కేశంపేట మాజీసర్పంచ్ ఎన్నం శ్రీధర్‌రెడ్డి, బోధనంపల్లి సర్పంచ్ ఏదిరే నాగేష్, కొండారెడ్డిపల్లి మాజీసర్పంచ్ పోలెపోగు రాజు, వీరమళ్ల సంతోష్‌కుమార్, కొక్కల కుమార్, చెన్నయ్య, కాకునూర్ పండి లింగం పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా పల్లకీసేవ

-భక్తులకు అన్నప్రసాదం వితరణ షురూ

ఘట్‌కేసర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

పోచారం డివిజన్ వెంకటాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకీసేవతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. స్వామివారి పల్లకీసేవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలుచేశారు. అనంతరం జరిగిన స్వామివారి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేశ్, కర్రె లలిత, మాజీ వైస్ ఎంపిపి కర్రె జంగమ్మ, డిసిసి ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్లు మెట్టు గణేశ్‌యాదవ్, భోజిరెడ్డి, స్థానికనాయకులు ఊదారి వేణుగోపాల్, సత్తయ్య, అశోక్, బి.నగేశ్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మగుడికి గంట అందజేసిన సీనియర్ న్యాయవాది

షాద్‌నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో జరుగుతున్న పోచమ్మ గుడి పునర్ ప్రారంభోత్సవం సందర్భంగా పోచమ్మ గుడి కిబీజేపీ రాష్ట్ర నాయకులు షాద్ నగర్ సీనియర్ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి గంట అందజేశారువెల్ జర్ల గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ గుడికి తన వంతుగా గంట అందజేసినట్లు చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అండగా నిలుస్తూ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు చెంది మహేందర్ రెడ్డికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్ బాబునాయక్, పోచమ్మ గుడి పునర్ నిర్మాణ కమిటీ చైర్మెన్ కావాలి నర్సింహులు, నేతలు కావాలి జగన్, జాంగారి రవి, కావాలి నర్సింహులు, దాస్య నాయక్, కటికేల తిరుపతి యాదవ్, దొడ్డి రవీందర్, దొడ్డి రాందాస్, కావాలి లక్ష్మయ్య, కెవిఎం, కావాలి యాదయ్య, జాంగారి రామయ్య, కావాలి బాల నర్సింహులు, జాంగారి యాదయ్య, జాంగారి సోమయ్య తుప్పరి శేఖరయ్యా, రఘుపతి యాదవ్, తుప్పరి వెంకటయ్య, తుప్పరి రామయ్య, తుప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల పరిష్కారంలో గందరగోళం

పూడూరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:

ప్రత్యేక సమగ్ర ఓటరుజాబితా సవరణ (ఎస్ఐఆర్) లో భాగంగా శనివారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఓ పాండు ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించిన నోటీసు విచారణదశ, దావాలు అభ్యంతరాల పరిష్కార కార్యక్రమంలో పలువురు ఓటర్లు తమ ఓటును నమోదుచేయించుకోకుండానే వెనుదిరిగారు. గతనెలలో గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరుజాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమంలో ఓటరుపేరు, వయస్సు, పుట్టిన తేదీలో తేడా, చిరునామాలో తేడా, మార్పు, మరణించిన ఓటరు, అర్హత ఉన్నా జాబితాలో ఓటరుపేరు లేక పోవడం, తండ్రిపేరు తదితర వివరాల్లో తప్పుగా ఉన్న ఓటర్లకు గ్రామంలో నిర్వహించే విచారణదశ, దావాలు, అభ్యంతరాల పరిష్కార కార్యక్రమంలో సంబంధిత పత్రాలను సమర్పించి పరిష్కరించుకోవాలని నోటీసులు జారీ చేశారు. అయితే శనివారం గ్రామంలో జరిగిన విచారణదశ, దావాలు అభ్యంతరాల పరిష్కార కార్యక్రమానికి ఆధార్‌కార్డుతో హాజరైన సదరు ఓటర్లకు నోటీసులో పేర్కొన్న ఏదైనా ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లనుకూడా జతపరచాలని అధికారులు మెలికపెట్టడంతో నిరాశే మిగిలింది. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు, పోస్టాఫీసు పాసుపుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్ తదితరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, ఎన్నికలసంఘం సూచించిన ఒరిజినల్ పత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని, స్వయంగా ఓటరే హాజరు కావాలని తెలపడంతో ఓటర్లు గందరగోళానికి గురయ్యారు. విచారణదశకు అందుబాటులోలేని ఓటరు ఇంటి యజమాని హాజరు కాగా, అలాంటి సడలింపుకు అవకాశాలు లేవని, నోటీసులో పేర్కొన్నన్న సదరు ఓటరే వ్యక్తిగతంగా హాజరు కాలాలని సూచించడంతో ఓట్ల తొలగింపుకోసమే ఇలాంటి ప్రకియ అని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు ఓటర్లు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలతోపాటు విదేశాలకు వెళ్లిన వారు ఉన్నారని, మరికొందరు ఆసుపత్రుల్లో ఉన్నారని అలాంటి ఓటరు విచారణదశ కార్యక్రమానికి ఎలా హాజరవుతారని అధికారులను ప్రశ్నించగా, తమకు అలాంటివారికి సడలింపుకోసం ఎలాంటి ఆదేశాలు లేవని ప్రతి ఒక్కరు హాజరు కావల్సిందేనని తేల్చిచెప్పారు. దీంతో పైన పేర్కొన గుర్తింపు కార్డులకు బదులు నోటీసులో సూచించిన జనన, నివాస, కులధృవీకరణ పత్రాలతోపాటు, స్టడీ సర్టిఫికెట్లు, భూమి పాస్‌పుస్తకం, 1-7-1987 సంవత్సరానికి ముందు ప్రభుత్వం స్థానిక అధికార యంత్రాంగం, బ్యాంకులు, పోస్టాఫీసు, భారత జీవితబీమా సంస్థతో పాటు ప్రభుత్వరంగ సంస్థల ద్వారా భారతదేశంలో జారీచేయబడిన ఏదైనా గుర్తింపుకార్డు, స్థానిక అధికారులచే జారీచేయబడిన కుటుంబ రిజిష్టర్ వంటివి మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే అధికారులు సూచించిన కార్డులు, సర్టిఫికెట్లు కొందరివద్ద లేవని ఇప్పటికిప్పుడు అలాంటివి తేవాలంటే ఎలా? అని పలువురు ప్రశ్నించారు. రెండవ విడత విచారణదశ కార్యక్రమంలోగా నోటీసులో సూచించిన ఏదైన సర్టిఫికెటొలేదా గుర్తింపు కార్డును పొంది సమర్పించి నమోదు చేయించుకోవాలని ఎంపిడిఓ పాండు సూచించటంతో నోటీసులోసూచించిన ఒరిజినల్ గుర్తింపుకార్డులు, సర్టిఫికెట్లు ఉన్నవారు మాత్రమే తమ ఓటును నమోదు చేయించుకున్నారు.



విచారణదశ, దావాలు అభ్యంతరాల పరిష్కారంలో సవరణ చేపడుతున్న ఎంపిడిఓ పాండు తదితరులు

తక్షణమే స్పందన.. సమస్యకు పరిష్కారం

పనులను పరిశీలనలో చైర్మన్ పత్యనాయక్, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 29, ప్రభాతవార్త:

పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులలో అంగడిబజార్ ప్రాంతంలో ప్రధాన మంచినీటి పైప్‌లైన్ ధ్వంసం అయ్యింది. దీని ప్రభావం 12వవార్డులోని శాంతినగర్‌పై పడే అవకాశం పొంచి ఉన్నది. దీంతో నీటిసమస్య తలెత్తకుండా చైర్మన్ పత్యనాయక్, స్థానిక కౌన్సిలర్ నాగిళ్ల జగన్‌లు కలిసి కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే మరమ్మతుపనులు చేపట్టాలని సూచించారు. దీంతో వెంటనే స్పందించిన కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతుపనులు చేయించి పూర్వ స్థితిని కల్పించారు. శాంతినగర్‌కాలనీలో నీటిసమస్యకు గురికాకుండా పనులు పూర్తిచేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల మానసిక ఉల్లాసానికి సైకిల్ పోటీలు

-అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి

సైకిల్ పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్, పాల్గొన్న వైస్‌చైర్మన్, కమిషనర్, ప్రజాప్రతినిధులు తదితరులు

శామీర్‌పేట, ఆగస్టు 29, ప్రభాతవార్త:

విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి సైకిల్ పోటీలు దోహదపడతాయని, క్రీడల్లో రాణించటానికి ఉపయోగపడతాయని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా సైకిల్ పోటీలు ఏర్పాటు చేయగా చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి జెండా ఊపి సైకిల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు జరిగిన క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి బహుమతులను అందజేశారు. అలియాబాద్ మున్సిపాల్టీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడాపోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి బహుమతులను అందజేశారు. పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ నెట్‌ను అందజేశారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించటంవల్ల క్రీడలతో పాటు ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి, మేనేజర్ టి.వేణుగోపాల్, మున్సిపల్ సిబ్బంది, గ్రామపెద్దలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిఇటి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైనవారి ఓటుహక్కును కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మాజీ మున్సిపల్‌చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర, ఆగస్టు 29, ప్రభాతవార్త:

దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న సర్ ప్రక్రియలో నెలకొన్న లోపాలను వెంటనే సరిదిద్ది, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని నాగారం బిజేపిపార్టీ ఆధ్వర్యంలో శనివారం ఆర్‌డిఓ కార్యాలయంలోని అధికారి సైదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాగారం మున్సిపల్ మాజీచైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని 39 పోలింగ్ బూత్‌లలో రెండవ విడత సర్ ప్రక్రియలో అనేకవ్యత్యాసాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. గతంలో సుమారు 48వేల ఓట్లుమాత్రమే ఓటర్లు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య దాదాపు 33 వేలకు తగ్గడం కేవలం 9 వేల ఓట్లు మాత్రమే క్లియర్ కావడం, మిగిలిన దాదాపు 24 వేల మంది ఓటర్లకు నోటీసులు జారీకావడం పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొన్నదని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధారాలు సమర్పించేందుకు ఒక్కరోజు మాత్రమే గడువు ఇవ్వడం సరికాదని తగినంత సమయం ఇవ్వాలని కోరారు. గతంలో ఓటు ఉండి చెల్లుబాటు అయ్యే ఆధారాలు కలిగిన వారికి సైతం నోటీసులు జారీ అయిన సందర్భాలను ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైనంత వరకు ఒకే కుటుంబానికి ఒకే పోలింగ్ బూత్ ఉండేలా చూడాలని కోరారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న బిఎల్ఓ,బిఎల్ఏలకు ఆన్‌లైన్ డాక్యుమెంట్ అప్ లోడింగ్ నిబంధనలు మరియు సాంకేతిక అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని సూచించారు.18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతతో పాటు చిరునామా మార్పులు చేసుకున్న అర్హులైన పౌరులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా ఓటర్ల జాబితాలో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి గాలి సంపత్, మాజీ కౌన్సిలర్ బిజ్జు శ్రీనివాస్‌గౌడ్, కీసర డివిజన్ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్, నాయకులు ధర్మేందర్, క్రిష్ణ, తాటి ఆనంద్, చక్రపాణి, కరుణాకర్, బాలయ్య, సాయికిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బండకుంట తండాలో బోరు మోటర్

-హర్షం వ్యక్తం చేసిన గిరిజన ప్రజలు

బోరు మోటర్ ఏర్పాటు ఏర్పాటు చేసిన సర్పంచ్, నాయకులు

నందిగామ, ఆగస్టు 29, ప్రభాతవార్త:

నందిగామ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బండ కుంట తండాలో శనివారం వార్డు సభ్యులు లింగం నాయక్ ఆధ్వర్యంలో సర్పంచ్ కొమ్ము కృష్ణ కొత్త బోర్ మోటార్‌ను ఏర్పాటుచేసి గిరిజన వాసులకు మంచినీటి కష్టాలు తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవక నీటి సమస్య తలెత్తుతుందని ప్రతి ఒక్కరు నీటి పొదుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ లింగం నాయక్, జగన్, రవి, బాలు, నరేష్, శంకర్, మహేందర్ నాయక్‌లు ఉన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ సహజం

-ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

హబీబ్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల, ఆగస్టు 29, ప్రభాతవార్త:

ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ సహజమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలవిద్యాధికారి హబీబ్ అహ్మద్ పదవీవిరమణ ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరై పదవీవిరమణ పొందుతున్న హబీబ్ అహ్మద్‌ను పూలమాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ సహజమని సూచించారు. కార్యక్రమంలో పిఎసిస్ చైర్మన్ బీంరెడ్డి, ఏఎంసి చైర్మన్ ఆంజనేయులు, మండల అధ్యక్షులు గోపాల్‌నాయక్, ఆయాగ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా 5కె రన్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్

5కె రన్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్, పాల్గొన్న జిల్లా అధికారి దామోదర్‌రెడ్డి, క్రీడాకారులు దృశ్యం

శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఆగస్టు 29, ప్రభాతవార్త:

జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని తూంకుంటలోని రామచంద్రమిషన్ వద్ద 5కె రన్ కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. శనివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని రామచంద్రమిషన్‌వద్ద రెండవరోజు జిల్లా యువజన, క్రీడలశాఖ, టేప్స్ సొల్యూషన్ అండ్ విన్నర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 5కె రన్ కార్యక్రమాన్ని క్రీడాకారులకు నిర్వహించారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని మేజర్ జాన్‌చంద్ హాకీ లెజెండ్ జయంతిని పురస్కరించుకుని 5కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మేజర్ జాన్‌చంద్ హాకీ లెజెండ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా యువజన, క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి, ఎక్స్ సర్వీస్‌మెన్ పవన్‌కుమార్, ఫౌండేషన్ చైర్మన్, ఫౌండేషన్ వారు, సుమారు 100మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచుకోవాలి

-విక్రమ్1 నావిగేషన్ సైంటిస్ట్ నిఖిల్ మద్దూరి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

షాద్‌నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచుకుని, భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని విక్రమ్1 నావిగేషన్ సైంటిస్ట్ నిఖిల్ మద్దూరి సూచించారు. బీసీ సేన షాద్‌నగర్ ఇంచార్జ్ ప్యాట జయశ్రీకాంత్ ఆధ్వర్యంలో హెరిటేజ్ వ్యాలీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిఖిల్ మద్దూరి విద్యార్థులతో ముచ్చటించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిఖిల్ మద్దూరి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని గుర్తించి, నిర్దిష్టలక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకుని నిరంతరం కృషిచేయాలని అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్‌లో దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో ఈ అవగాహన సదస్సును నిర్వహించినట్లు బీసీ సేన షాద్‌నగర్ ఇంచార్జ్ ప్యాట జయ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ వాలి ప్రిన్సిపల్ ప్రదీప్, పి. మిశ్రీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, సైంటిస్ట్ మద్దూరి నిఖిల్, హాజిపల్లి మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల బకాయి.. బిజెపి లడాయి..



ధర్నాలో పాల్గొన్న బిజెపి నాయకులు

షాద్‌నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

జిల్లా అధ్యక్షులు రాజభూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నెల్లి వర్ధన్‌రెడ్డి, అందే బాబయ్య, కక్కునూరి వెంకటేష్ గుప్త పాల్గొని విద్యార్థుల సమస్యలపై బీజేపీ చేపట్టిన పోరాటానికి మద్దతు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కక్కునూరి వెంకటేష్‌గుప్తా, జిల్లాకోశాధికారి అమడపురం నరసింహా, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నవీన్‌మాల, జిల్లా ఎస్సీ మోర్చా కన్వీనర్ నరసింహా, జిల్లా గిరిజనమోర్చా కన్వీనర్ మోహన్ సింగ్, షాద్‌నగర్ నగర కన్వీనర్ శ్రీనివాస చారి, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షులు పిట్టల సురేష్‌తోపాటు పల్లె అంజయ్య, పాండురంగా రెడ్డి, సోప్పరి నర్సింహా, యుగంధర్, కనం ఉదయ్, పుట్నాల సాయి, పాలది శ్రీనివాస్, మాల్తూకర్ శివాజీ, రావు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

షాద్‌నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త:

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 27వార్డు తిరుమలకాలనీలో సిసిరోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్‌చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ రోడ్డునిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించి, పనులను నాణ్యతాప్రమాణాలతో, వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మురళీమోహన్, పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్, రవీందర్ రెడ్డి మంగమధు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం ఎంత